
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 11 ఆగస్టు 2025



యూరియా.. ఏదయ్యా?

- జిల్లాలో తీవ్ర కొరత
- ఆర్బీకేలు, సహకార సంఘాల ద్వారా అరకొరగా సరఫరా
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా, డీఏపీ ఇస్తామంటున్న వైనం
- అధిక ధరలకు విక్రయం
- అదును దాటిపోతుండడంతో అన్నదాతల్లో ఆందోళన

యూరియా నిల్వలు (ఫైల్)

- నరసన్నపేట మండలం కామేశ్వరిపేటకు చెందిన ఒక రైతు ఇటీవల నరసన్నపేటలోని ఓ ఎరువుల దుకాణం వద్దకు వెళ్లి యూరియా, డీఏపీ కావాలని అడిగాడు. తన వద్ద యూరియా, డీఏపీ స్టాక్ లేదని, కావాలంటే 20.20.0.13 రకం ఎరువు ఉందని షాపు యాజమాని చెప్పాడు. దీంతో ఆ రైతు తప్పనిసరి పరిస్థితుల్లో 20.20.0.13 రకం ఎరువును తీసుకెళ్లాడు.

- నరసన్నపేట మండలం కంబకాయి గ్రామానికి చెందిన ఓ రైతు యూరియా కోసం ఇటీవల స్థానిక ఓ ఎరువుల దుకాణం వద్దకు వెళ్లాడు. యూరియా, డీఏపీ కావాలని అడిగితే జింక్, గుళికలు కొనుగోలు చేస్తే వాటిని ఇస్తామని షాపు యజమాని చెప్పాడు. అదేంటని ప్రశ్నిస్తే.. కొంటే కొను.. లేదంటే వెళ్లిపో.. అని ఆ రైతుతో యజమాని దురుసుగా ప్రవర్తించాడు.

నరసన్నపేట/ఇచ్ఛాపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే), సహకార సంఘాల ద్వారా యూరియాను అరకొరగా సరఫరా చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పైగా కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా, డీఏపీ ఇస్తామని షరతు పెడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఒకపక్క యూరియా దొరక్కపోవడం.. మరోపక్క అదును దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఈ ఏడాది జిల్లాలో సుమారు 4,42,775 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 3,41,775 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. జిల్లాలో 30 మండలాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా, కాంప్లెక్స్ ఎరువులు సుమారు 25వేల మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేశారు. వీటిలో యూరియా 10వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. వరి పంటకు సంబంధించి ఎకరాకు మూడు విడతలుగా 50 కేజీల వరకు యూరియా అవసరం. ఈ లెక్కన జిల్లాలో సాగు చేస్తున్న 3,41,775 ఎకరాల వరికి 35 వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా అవసరం ఉంటుంది. కానీ, అధికారులు కేవలం 10వేల మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే పంపిణీ చేశారు. దీంతో 25వేల మెట్రిక్ టన్నుల కొరత ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నరసన్నపేట మండలంలో సుమారు 7వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా యూరియా 589 మెట్రిక్ టన్నులు, డీఏపీ 220 మెట్రిక్ టన్నులు, గ్రోమర్ 10 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు పంపిణీ చేశారు. సరిపడా యూరియా లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. యూరియా కావాలంటే.. జింక్, దుబ్బు గుళికలు, పోటాస్ తదితర కాంప్లెక్స్ ఎరువులను కొనాల్సిందేనని షరతులు పెడుతున్నారు. పైగా వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల్లో 45 కిలోల యూరియా బస్తా రూ.275కు (మిగతా 8వ పేజీలో..)





గార నుంచి శ్రీకాకుళం వరకు ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం

- ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్
- మేనిఫెస్టో అమలు ఘనత సీఎందే: ఎమ్మెల్యే శంకర్

7లో



పోర్టు నిర్వాసిత కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సుందరంగా పునరావాస కాలనీ నిర్మిస్తాం

- వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు నిర్వాసితులకు సర్వాంగ సుందరంగా పునరావస కాలనీ నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం నౌపడలో పోర్టు నిర్వాసిత గ్రామాల కాలనీలో రూ.32కోట్లతో 12 రకాల మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'పోర్టు నిర్మాణంతో జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పోర్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్ల త్యాగం చేసిన మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీలో ఎటువంటి సమస్యలు లేకుండా చేస్తాం. పునరావాస కాలనీలో ఇప్పటికే విద్యుత్ సరఫరా ఏర్పాటు చేశాం. సిమెంట్ రోడ్ల నిర్మాణం త్వరలోనే పూర్తవుతుంది. బడి,గుడి నిర్మాణం కూడా చేపడతాం. నిర్వాసితులు ఆందోళన చెందొద్దు. అందరి సమస్యలు పరిష్కరిస్తామ'ని తెలిపారు. పునరావాస కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అంతకుముందు రూ.50లక్షల వ్యయంతో నౌపడ-టెక్కలి రహదారి నుంచి ఇజ్జువరం గ్రామానికి సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు జీరు భీమారావు, ఎల్.ఎల్.నాయుడు, అట్టాడ రాంప్రసాద్, బాడాన రమణమ్మ, రెడ్డి అప్పన్న, బొడ్డేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదిత్యుడి ఆదివారం ఆదాయం రూ.5.12లక్షలు

అరసవల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత.. అరసవల్లి ఆదిత్యుడ్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యూలో బారులుదీరారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.5,12,851 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,71,200, విరాళాల ద్వారా రూ.69,481, ప్రసాదాల రూపంలో రూ.1,72,170 సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.



పలాస-కాశీబుగ్గ పట్టణం వ్యూ

- ఆ నాలుగు కలిపి..
పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలను కలిపి పలాస జిల్లాను ప్రకటిస్తారని తెలుస్తోంది. అదే జరిగితే శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలతో శ్రీకాకుళం జిల్లా కొనసాగనుంది. ఎలా చూసుకున్నా జిల్లా కేంద్రం 50 కిలోమీటర్లలోపే ఉంటుంది. పైగా నియోజకవర్గాల పునర్విభజన ఉండనుంది. కొత్తగా ఏర్పాటయ్యే నియోజకవర్గాలు అనుబంధంగా రెండు జిల్లాల్లో కలిసే అవకాశం ఉంది.

కొత్త జిల్లాగా.. పలాస!

- నాలుగు నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష
- జిల్లాల ప్రకటనలో పట్టించుకోని వైసీపీ
- తాజాగా కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుతో కదలిక

కాశీబుగ్గ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన మళ్లీ తెరపైకి వచ్చింది. కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దుల నిర్ధారణ, పేర్ల మార్పు, రెవెన్యూ డివిజన్లలో మార్పులు వంటి వాటిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేసింది. వీటికి సంబంధించి అధ్యయనం చేసి నెలరోజుల్లో నివేదికలు ఇవ్వాలని మంత్రుల ఉప సంఘానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. దీంతో కొత్త జిల్లాల ఏర్పాటు, డివిజన్లలో మార్పులు వంటి వాటిపై చర్చ ప్రారంభమైంది. అందులో భాగంగా పలాస కేంద్రంగా కొత్త జిల్లా ప్రకటన వస్తుందని అంతా భావిస్తున్నారు. వైసీపీ హయాంలో ప్రతిపాదన ఉన్నా పట్టించుకోలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలాసను కొత్త జిల్లాగా ప్రకటిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

పేరుకే శ్రీకాకుళం జిల్లా కానీ.. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గ ప్రజలు 100 కిలోమీటర్లు ప్రయాణిస్తే కానీ జిల్లా కేంద్రానికి చేరుకోలేని పరిస్థితి. ఏదైనా పనిమీద జిల్లా కేంద్రానికి రావాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల వారు రావాలంటే బస్సులు మారుకొని ప్రయాణించాలి. వైసీపీ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలోనే పలాసను జిల్లాగా ప్రకటించాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. కానీ అప్పటి పాలకులు పట్టించుకోలేదు. కొత్త జిల్లాల ఏర్పాటు హేతుబద్ధంగా జరగలేదు. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజాం నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలో, పాలకొండ నియోజకవర్గాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేశారు. కానీ సుమారు ఎనభై నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం నియోజకవర్గాలను మాత్రం శ్రీకాకుళంలోనే కొనసాగించారు. ఈ నియోజకవర్గాల ప్రజలకు పాలనాపరంగా ఎటువంటి మార్పులు లేకపోవడంతో అప్పట్లో నిరాశ చెందారు. ఎంతోచరిత్ర కలిగిన శ్రీకాకుళం జిల్లా నుంచి వేరుచేయడం బాధాకరమే అయినా.. పాలనా సౌలభ్యం కోసం ఈ ప్రాంతీయులు మాత్రం పలాస (మిగతా 7వ పేజీలో..)

పీఏసీఎస్ పాలకమండళ్ల నియామకం 7లో

వంశధార తీరంలో మృతదేహం కలకలం 8లో



చినలోహరిబంద సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

ఉద్దానంలో ఎలుగుబంట్లు హల్‌చల్

8లో

గంజాయి పట్టివేత

- రెండుచోట్ల 7.2 కిలోలు స్వాధీనం
- నలుగురి అరెస్టు.. మరొకరు పరారీ

ఎట్టకేలకు ఎత్తిపోతలకు మోక్షం

- అక్కులపేట వద్ద పథకానికి పూర్తయిన మరమ్మతులు
- సాగునీటి విడుదలపై రైతుల హర్షం

7లో



పాతపట్నం రైల్వేస్టేషన్

ఒడిశాకు 4 ఆంధ్రాకు 1

- రైళ్ల కేటాయింపులో రైల్వేశాఖ వివక్ష
- గుణుపూర్-నౌపడ మార్గంపై చిన్నచూపు
- తెలుగువారికి ఒక్క పాసింజర్ రైలే దిక్కు

పాతపట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గుణుపూర్-నౌపడ రైల్వేలైన్ నేరోగేజ్ నుంచి బ్రాడ్‌గేజ్‌గా స్థాయి పెరిగి దశాబ్ద కాలం దాటింది. ఈ మార్గంలో ఒడిశా వాసుల కోసం కేంద్రం నాలుగు రైళ్లను నడుపుతోంది. కానీ, ఆంధ్రా వారికి మాత్రం ఒక పాసింజర్ రైలునే పరిమితం చేసింది. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకుల వైఫల్యమా? లేక రైల్వే శాఖకు తెలుగువారంటే చులకనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రైల్వేలైన్ నేపథ్యం..

పర్లాకిమిడి కృష్ణగజపతి మహారాజుల కాలంలో గుణుపూర్-నౌపడ నేరోగేజ్ రైల్వేలైన్‌ను వేశారు. ఈ మార్గంలో గుణుపూర్-నౌపడ రైలు నాటిరాజుల పాలనకు గుర్తుగా నడిచేది. ప్రకృతి సోయగాల మధ్య బొగ్గు ఇంజిన్‌తో నడిచే ఈ రైలులో ప్రయాణం ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగించేది. నౌపడ నుంచి గుణుపూర్ వరకూ ఉన్న ప్రాంతాల్లోని చిన్నపాటి వర్తకుల జీవనోపాధికి ఈ రైల్వేసేవ ఎంతగానో ఉపకరించేది. అయితే, నిర్వహణ భారానికి తగిన ఆదాయం రావడం లేదంటూ 2012లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ మార్గం గుండా రైల్వే సేవలను నిలుపుదల చేసింది. దీనిపై ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు సుదీర్ఘ పోరాటం చేశారు. దీంతో ఈ మార్గాన్ని నేరోగేజ్ నుంచి బ్రాడ్‌గేజ్‌గా కేంద్రం మార్పు చేసింది. 2014లో బ్రాడ్‌గేజ్ పనులు పూర్తి చేయించి రైల్వే సేవలను పునరుద్ధరించింది. 2015 ఫిబ్రవరి 9న గుణుపూర్-విశాఖ పాసింజర్‌ను ఈ మార్గంలో ప్రారంభించింది.

ఒక రైలుతో సరి..

గుణుపూర్-నౌపడ బ్రాడ్‌గేజ్‌గా మారిన తరువాత ఈ దశాబ్ద కాలంలో ఒడిశాకు గుణుపూర్-విశాఖ పాసింజర్‌తోపాటు గుణుపూర్-రూర్కెళా (రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్), గుణుపూర్- కటక్ (మోమూ ఎక్స్‌ప్రెస్), గుణుపూర్-పూరీ(ఎక్స్‌ప్రెస్) సేవలు (మిగతా 8వ పేజీలో..)

జవాబులన్నీ.. ఒకే పుస్తకంలో..

- ప్రైవేటుకు దీటుగా.. ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు
- విద్యార్థులకు అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు
- నేటి నుంచి ఫార్మెటివ్-1



పాఠశాలల్లో పంపిణీ చేయనున్న బుక్‌లెట్‌లు

హరిపురం/ నరసన్నపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ పరీక్షలు నిర్వహించేలా.. విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేలా నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు ఒకటి నుంచి 10వ తరగతి వరకు సమ్మెటివ్, ఫార్మెటివ్ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రశ్నాపత్రాలతోపాటు జవాబులు రాసేందుకు తెల్లకాగితాలు ఇచ్చేవారు. ఇకపై ఈ ఏడాది నుంచి అన్ని పరీక్షల జవాబులు ఒకే బుక్‌లో రాసేలా.. విద్యార్థులకు అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లను ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు సుమారు 1.5 లక్షల మంది చదువుతున్నారు. ఒకటి, రెండు తరగతులకు మూడు సబ్జెక్టులు, 3,4,5 తరగతులకు నాలుగు సబ్జెక్టులు ఉన్నాయి. అలాగే ఆరు, ఏడు తరగతులకు ఆరు సబ్జెక్టులు, ఎనిమిది నుంచి పదోతరగతి వరకు విద్యార్థులకు ఏడు సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఏడాదికి నాలుగు సంగ్రహణాత్మక, రెండు నిర్మాణాత్మక పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు విద్యార్థులందరికీ ఉచితంగా అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు అందజేయనున్నారు. ఒక్కో బుక్‌లెట్‌లో 80 నుంచి 120 పేజీలు కేటాయించారు. గ్రాఫులు దీనిలోనే పొందుపరిచారు. బహుళ ఐచ్ఛిక ప్రశ్నలకు (మిగతా 7వ పేజీలో..)



సమగ్ర మూల్యాంకనం కోసం..

బుక్‌లెట్ విధానంలో అన్ని జవాబులు ఒకే చోట ఉంటాయి. సమగ్ర మూల్యాంకనానికి వీలుంటుంది. పుస్తక సమీక్షలు, ప్రాజెక్టు పనులు ఒకేచోట అందుబాటులో ఉంటాయి. పాఠశాలలకు తెల్ల కాగితాలు స్టేషనరీ ఖర్చు తగ్గుతుంది. పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో బుక్‌లెట్ విధానమే వాడుతున్నారు. దీనికి అనుగుణంగా ప్రవేశపెట్టిన బుక్‌లెట్ విధానంతో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం.

- ఎం.లక్ష్మణరావు, ఎంఈవో, మందస

పీఏసీఎస్ పాలకమండళ్ల నియామకం


జగన్నాథరావు


మురళి

జి.సిగడాం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జి.సిగడాం, బాతువ పీఏసీఎస్ పాలకమండళ్ల నియామకం చేపడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జి.సిగడాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా మెట్టవలసకి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు బెవర జగన్నాథరావు, డైరెక్టర్లుగా పడాల అప్పన్న మాస్టారు, విక్రం కామేశ్వరరావులను నియమించారు.
● బాతువ పీఏ సీఎస్ అధ్యక్షుడిగా గెడ్డకంచరాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నక్క మురళి, డైరెక్టర్లుగా పోతిరెడ్డి సన్యాసిరావు, రెడ్డి సంతోష్ కుమార్‌లను నియమించారు. వీరి నియామకానికి కృషి చేసిన విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు(ఎన్ఈఆర్)లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పైడిభీమవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సుశీల వర్మ


సుశీలవర్మ

రణస్థలం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పీఏసీఎస్ చైర్ పర్సన్‌గా టీడీపీ సీనియర్ నాయకురాలు దంతులూరి సుశీల వర్మను నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. డైరెకర్లుగా డి.రవీంద్ర, గిరి బాబును నియమించారు. అలాగే రణస్థలం ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్‌గా లావేరు మండల జనసేన నాయకుడు బొంతు విష్ణుకుమార్‌ను నియమించారు. సభ్యులుగా పీవీ రత్నం, లంక వెంకట రమణను ఎంపిక చేశారు. అన్ని పార్టీలకు సమ ప్రాధాన్యత కల్పించడం పై కూటమి నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

'వీ-డెంటల్'లో నూతన ఇంప్లాంట్ చికిత్స విజయవంతం

● జిల్లాలో తొలిసారిగా 'సబ్ పెరియోస్టిల్' ట్రీట్‌మెంట్


పళ్లను అమర్చేందుకు శస్త్రచికిత్స చేస్తున్న దంత వైద్యులు

అరసవల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సాధారణ ఇంప్లాంట్స్ వేసేందుకు కూడా వీలుపడని వ్యక్తికి (అసలు దంతం ఎముక లేని రోగి) ఇంప్లాంట్ విధానంతో కృత్రిమ పళ్లు అమర్చినట్లు శ్రీకాకుళంలోని వీ-డెంటల్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ మాడుగుల జాన్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇచ్ఛాపురానికి చెందిన సీహెచ్ మాలతి మూడేళ్లుగా పైదవడ పళ్లు లేక బయటకు తీసి మరలా పెట్టుకునే పళ్ల సెట్టుతో ఇబ్బంది పడుతున్నారు. ఆమెకు దవడ ఎముక అసలు లేకపోవడంతో ఎలాంటి ఇంప్లాంట్స్ వేయడం కుదరదని స్థానిక దంత వైద్యులు చెప్పారు. చివరకు ఆమె వీ డెంటల్ ఆసుపత్రికి వచ్చా రు. ఆమెకు జిల్లాలో తొలిసారిగా సుమారు నాలుగు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి వైద్యులు మాడుగుల అనిత, రమేష్ నాయుడు, సంతోష్, రమ్య ఫిక్స్‌డ్ పళ్లను విజయవంతంగా అమర్చారు. జిల్లాలోనే తొలి సారిగా చికిత్సను విజయవంతంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ మాడుగుల జాన్ తెలిపారు.

ఎట్టకేలకు ఎత్తిపోతలకు మోక్షం

● హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు


ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న సాగునీరు

ఆమదాలవలస, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అక్కులపేట ఎత్తిపోతల పథకం మరమ్మ తులు పూర్తయి సాగునీరందిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎత్తిపోతల పథకం బాగు చేసి పంట పొలాలకు నీరందించాలని రైతులు ఎమ్మెల్యే కూన రవి కుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వంతో మాట్లాడి రూ.18.50 లక్షల నిధులను మంజూరు చేయించారు. తక్షణం సంబంధిత అధికారులు ఎత్తిపోతలకు మరమ్మతులు చేపట్టారు. ఆదివారం ఈ పథకం ద్వారా సాగునీటిని విడుదల చేశారు. ఎత్తిపోతల విజయవంతం కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు, ఎంపీటీసీ ప్రతినిధి బి.లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ విద్యుత్ అధికారులు పాల్గొన్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా అక్కులపేట, ఎస్ఆర్‌సీపేట, ఈసర్లపేట, కాళోపర్తి, సలికాం, చింతలపేట, దన్నానపేట, బొరగ వలస గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగునీరందుతుం దన్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే రవికుమార్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి పథకాన్ని వినియోగంలోకి తీసుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఖరీఫ్‌కు సాగునీరం దించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రవికుమార్‌కు రైతులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం

● ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ట్రాక్టర్‌పై వస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. 'అన్నదాత సుఖీభవ'లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో నాటుబండ్లు, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ పెట్టు బడికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. ఈ పథకంతో రైతులు ఎంతగానో సంతోషం గా ఉన్నారన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్‌కి సాగునీరందించే ఉద్దేశంతో మడ్డువలస, తోటపల్లి, నారాయణపురం కాలువాల్లో పూడికలు తీయించి రైతులకు సాగు నీరందించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ అందించిన ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయా ణం కల్పించనుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, జిసిగడాం, లావేరు, రణస్థలం మండలాల టీడీపీ అధ్యక్షులు కుమరాపు రవికుమార్, ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, నాయకులు టంకాల మౌళీశ్వరరావు, బోగాది అప్పలనాయుడు, పిసిని జగన్నాథం పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలు ఘనత సీఎందే: శంకర్


అరసవల్లి: ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి/గార రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్న దాత సుఖీభవ పథకం అమలు చేసి సీఎం చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అనిపించుకున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం గార నుంచి అరసవల్లి డీసీఎంఎస్ కార్యాలయం వరకు 200 ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవలో భాగంగా రూ.5వేలు, పీఎం కిసాన్ రూ.2 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు సాయమందించారన్నారు. ఎరువుల రాయితీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి రాధాకృష్ణారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, టీడీపీ నేతలు ఉంగటి వెంకటరమణ, అరవల రవీంద్ర, చిన్నారావు, మూకళ్ల శ్రీనివాస్, జ్యోతి భాస్కర్, రమణమూర్తి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా గౌరీశంకర్

గార, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వమరవెల్లి జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఎ.గౌరీశంకర్ నియమితులయ్యారు. ఇంతవరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఎస్.తిరుమల చైతన్య గతనెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో డైట్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రక్తదాతలే నిజమైన సేవకులు

అరసవల్లి ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రక్తదాతలే నిజమైన సేవలకులని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక పెద్ద మార్కెట్ ఆవరణలో ఆదివారం మార్కెట్ మర్చంట్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించి అభినందించారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గౌరీశంకర్‌కు జాతీయ పురస్కారం

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విశాఖ సంస్కృతి పత్రిక నిర్వహించిన జాతీయస్థాయి హాస్య కథల పోటీలో శ్రీకాకుళం నగరానికి చెందిన రచయిత భమిడిపాటి గౌరీశంకర్ ఉత్తమ రచయితగా జాతీయ పురస్కారం అందించారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు అవార్డు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్.సన్యాసిరావు, రామకోటయ్య, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న ఎస్ఐ

గార రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ గంగరాజు అన్నారు. కళింగపట్నం, గార, శ్రీకూర్మం తదితర గ్రామాల పరిధిలోని ఆటో డ్రైవర్లకు ఆదివారం అవగాహన కలిగించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, డ్రైవర్ సీటు పక్కన కూర్చోపెట్టవద్దన్నారు. రవాణా పరంగా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడడం వంటివి చేసి పట్టుబడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

కొత్త జిల్లాగా.. పలాస!

(ఐదో పేజీ తరువాయి)

జిల్లాకేంద్రాన్ని ప్రకటించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారు.

● ఆమోదయోగ్యం

పలాసను జిల్లాగా ప్రకటిస్తే నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంటుంది. భౌగోళికపరంగా పలాస నాలుగు నియోజకవర్గాలకు మధ్యలో ఉంది. ఇచ్ఛాపురం, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలకు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు అందుబాటులో ఉన్నాయి. వర్తక, వాణిజ్యపరంగా హంగులతోపాటు జంట పట్టణాలకు పాలనాపరంగా అనుకూలతలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికే 8 మండలాలతో పలాస రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతోంది. పోలీస్ సబ్ డివిజన్, ఆపై విద్యుత్ డివిజన్‌గాను ఉంది. జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే అన్నిరకాల ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ప్రధాన శాఖలు మాత్రమే ఈ నియోజకవర్గాల్లో సేవలందిస్తున్నాయి. మిగతా శాఖలు జిల్లా కేంద్రం నుంచి సమన్వయం చేసుకుంటున్నాయి. తూనికలు, కొలతలు, కాలుష్య నియంత్రణ శాఖ, ఆహార కల్తీ నియంత్రణ, ప్రణాళిక శాఖ..ఇలా అన్నిరకాల శాఖల కార్యాలయాలు శ్రీకాకుళంలోనే ఉన్నాయి. ప్రాంతీయ కార్యాలయాలు సైతం లేవు. అదే పలాస జిల్లా కేంద్రమైతే అన్నిరకాల కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించి పలాసలో భూముల కొరత లేదు. అధికారులు, ఉద్యోగులకు నివాసయోగ్యంగానూ ఉంటుంది. ప్రముఖ రైల్వేస్టేషన్‌గా పలాస ఉంది. ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి బస్సు డిపో కూడా ఉంది. జిల్లా కేంద్రానికి తగ్గట్టు అన్ని అర్హతలు ఉన్నాయి. పైగా ఉద్దానం, తీరం, మైదానం, ఏజెన్సీ కలగలిపిన ప్రాంతం కావడం కలిసి వచ్చే అంశం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పలాసను జిల్లాగా ఏర్పాటు చేయడంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని నాలుగు నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో కూటమి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకాంక్షను నెరవేర్చాలి



పలాసను జిల్లాగా ఏర్పాటు చేయడం అవసరం. సుదూర ప్రాంత ప్రజలు పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తే హర్షిస్తారు. మండలాలను కలిపే సందర్భంలో ప్రజాభిప్రాయం తీసుకోవాలి. పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం పలాసను కొత్త జిల్లాగా ప్రకటించి.. ఈ ప్రాంతీయులు ఆకాంక్షను నెరవేర్చాలి.

- ఎల్.వెంకటాచలం, ఉపాధ్యాయుడు, పలాస

చాలా కష్టం..



ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గ ప్రజలు శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే రోజంతా అవుతోంది. అదే పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే వ్యయప్రయాసలు తగ్గుతాయి. పాలనాపరమైన సౌలభ్యాలు పెరుగుతాయి. అందుకే కేబినెట్ సబ్ కమిటీ ఈ విషయంలో సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలి. ప్రజాభిప్రాయం బలంగా వారి దృష్టికి వెళ్లాలి.

- లొడగల కామేశ్వరరావు యాదవ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ

అన్నవరంలో శ్రీలత బృందం నృత్య ప్రదర్శన

ఆమదాలవలస, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నృత్య కళాకారిణి కూన శ్రీలత బృందం అన్నవరంలోని సుప్రసిద్ధ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయ అధికారుల ఆహ్వానం మేరకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. నాట్యశ్రీ నృత్య కళానికేతన్ కళాకారులు సుస్మిత చరిష్మా, ఝాన్సీరాణి, రజిత, లోహిత సౌమ్య ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ అధికారులు కళాకారులను అభినందించారు.

సాగునీటి కోసం శ్రమదానం



ఆమదాలవలస, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): లొద్దలపేటలో సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రామ రైతులు ఆది వారం శ్రమదానం చేశారు. గ్రామా నికి చెందిన సుమారు 50 ఎకరాలకు సాగునీరం దించాల్సిన వెంకన్న బట్టి పూర్తిగా పూడికతో నిండిపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేక పోవడంతో రైతులంతా కలిసి బట్టి లోని పిచ్చి మొక్కలతో పాటు పూడి కలను తొలగించారు. సాగునీరు ప్రవహించి పంట పొలాలకు వస్తోందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

శాసనమండలిలో సమస్యలను ప్రస్తావిస్తా

● మండల సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు

గార, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను త్వరలో జరగనున్న శాసనమండలి సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఆదివారం ఎంపీపీ గొండు రఘురాం అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ., నిధుల లేమితో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని, ప్రజలక సమాధానం చెప్పలేకున్నామని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వాలు ఏమైనా సరే అధికారులు ఉంటా రని, అందు వల్ల గ్రామాభివృద్ధిలో ప్రజా ప్రతినిధులను కలుపుకుని పోవాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు కూడా సక్రమంగా అమలు చేయలేదని విమ ర్శించారు. సమావేశంలో ఎంపీడీవో ఈశర్ల రఘు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, నీటిపారుదలశాఖ డీఈఈ క్రాంతికుమార్, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పోలాకి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఆధ్యాత్మిక వేత్త చాగంటి యిప్పిలి రామకృష్ణశర్మ అన్నారు. ఆదివారం దండులక్ష్మీపురం చింతాడపేట రామయోగి సేవాశ్రమంలో సత్సంగం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, బొడ్డేపల్లి అప్పలనాయుడు, కరుకోల అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అశోక్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ జన్మదిన వేడుకలు ఆదివారం కూటమి నేతల ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. రామయ్యపుట్టుగలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్, నీలోత్పల దంపతులకు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నేతలు శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు, మైనార్టీ నేత బీమా రావు రౌళో, బి.రమేష్, రంగా రౌళో, ఎస్వీ రమణ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ నేతలు, సోం పేట, కంచిలి మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

అరసవల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సోంపేటలో అక్టోబరు 4, 5 తేదీల్లో నిర్వహించనున్న మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వర రావు కోరారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయిం చాలని, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నాలుగు లేబర్ కోడ్ల ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అల్లు మహాలక్ష్మి, జి.అమరావతి, ఎం.ఆదినారాయణ మూర్తి, కె.సూరయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, అలాగే ఇప్ప టికే నమోదైన అర్జీల స్థితిగతులను 1100 నెంబర్‌కు డయల్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

జవాబులన్నీ.. ఒకే పుస్తకంలో..

(ఐదో పేజీ తరువాయి)


అసెస్‌మెంట్ బుక్‌లెట్స్

జవాబులు గుర్తించేందుకు ఓఎంఆర్ పత్రాలను జతచేశారు. జవాబులు దిద్దిన తర్వాత మార్కులను ప్రొగ్రెస్ రిపోర్టులో నమోదు చేస్తారు. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో పుస్తకాన్ని ఇవ్వనున్నారు. బుక్‌లెట్‌పై విద్యార్థి వివరాలు, అపార్ నెంబరు నమోదు చేస్తారు. బుక్‌లెట్లన్నీ ఎమ్మార్సీలకు, పాఠశాలలకు ఇప్పటికే చేరాయి. విద్యార్థి రాసిన జవాబులన్నీ బుక్‌లెట్‌లో ఉండ టం వల్ల వారి సామర్థ్యాలను అంచనా వేసే వీలుంటుంది. ప్రతీ విద్యార్థి యొక్క ప్రగతి విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి చివర వరకు ఏవిధంగా అభివృద్ధి చెందిదో తెలుసుకునేందుకు అవకాశం ఉంది. ఈ నెల 11 నుంచి 14 వరకు ఫార్మెటివ్ అసెస్‌మెట్-1 పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల నుంచే అసెస్‌మెంట్ బుక్ లెట్‌ను ఉపయోగించనున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎచ్చెర్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పొన్నాడ గ్రామానికి చెందిన నేతింటి రాములు(65) శనివారం రాత్రి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. రాములుకు రెండేళ్ల కిందట ఎడమ కాలు విరిగిపోవడంతో శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత ఆయన ఓ ఆవును కొనుగోలు చేసి పాలు విక్రయిస్తూ వచ్చిన సొమ్ముతో మందులను కొనుగోలు చేసుకునేవాడు. అయితే ఇటీవల ఆవు సరిగా పాలు ఇవ్వకపోవడం, మందుల కొనుగోలుకు ఎవరికీ డబ్బులు అడిగేందుకు ఇష్టపడక మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో శనివారం కళ్లంలో గడ్డి మందును తాగేశాడు. దీనిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. ఆదివారం శవపంచనామా అనంతరం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

ఎచ్చెర్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం గ్రామ సమీపంలో రొయ్యల చెరువులో పనిచేస్తున్న గార మండలం తోణంగి పంచాయతీ బచ్చువానిపేటకి చెందిన బచ్చు రామారావు(44) శనివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నాలుగేళ్లుగా రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్న రామారావు శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో చెరువులో నీరు నింపేందుకు మోటారు స్విచ్ ఆన్ చేస్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీనిని గమనించిన తోటి వర్కర్లు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య వర లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి..

పలాస రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పలాస మండలం చిననీలావతి గ్రామానికి చెందిన మిలటరీ ఉద్యోగి సౌర సంతోష్‌కుమార్(32) శనివారం రాత్రి మృతి చెందాడు. సంతోష్‌కుమార్ మహారాష్ట్రలోని నాసిక్‌లో ఆర్మీగా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. మూడురోజుల కిందట సెలవుపై స్వగ్రామానికి వచ్చిన అతడు శనివారం రాత్రి మృతి చెందగా, కారణాలు తెలియరాలేదు. సంతోష్ తండ్రి జానకీరావు కరోనా సమయంలో చనిపోయారు. తల్లి హేమలత గ్రామంలోనే నివసిస్తుండగా భార్య జయశ్రీ, కుమారుడు అండమాన్‌లో ప్రస్తుతం ఉన్నారు. అదే రోజు రాత్రే అంత్యక్రియలు నిర్వహించడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

వంశధార తీరంలో మృతదేహం కలకలం

సరుబుజ్జిలి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వంశధార నదీ తీరంలో తెలికిపెంట బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని తెలియడంతో ఆదివారం కలకలం రేగింది. ఎవరైనా హత్య చేశారా? లేక ఎక్కడి నుంచి తీసుకువచ్చి ఇక్కడ పాతి పెట్టారా? అన్న పుకార్లు షికార్లు చేశాయి. విషయం తెలుసుకున్న సరుబుజ్జిలి పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. జలుమూరు మండలం కొండ కామేశ్వరపేటకి చెందిన ఓ బిచ్చగాడు అనారోగ్యంతో మృతి చెందాడు. వంశధార ఆవలి ప్రాంతం సక్రమంగా లేకపోవడంతో తెలికిపెంట బ్రిడ్జి సమీపంలో దహన సంస్కారాలు చేసేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు. అయితే ఈ విషయం తెలికిపెంట గ్రామస్థులకు తెలియడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై వారిలో ఒకరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇరుపక్షాలకు ఇబ్బంది లేని ప్రదేశంలో దహన సంస్కారాలు చేయించడంతో వివాదం సద్దుమణిగింది.

ఉద్దానంలో ఎలుగుబంట్లు హల్‌చల్

హరిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మందస మండలం లోహరిబంద పంచాయతీ చిన్నలోహరిబంద, కొత్తపేట, దుమ్మూలూరు తదితర గ్రామాల పరిధిలో ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం రెండు ఎలుగుబంట్లు చిన్నలోహరిబంద గ్రామంలోనే మకాం వేసి వీరంగం సృష్టించాయి. గతేడాది ఎర్రముక్కాం, దున్నూరు గ్రామాల్లో ఎలుగు సృష్టించిన బీభత్సాన్ని మరవకముందే ప్రస్తుతం రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్లోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి ఆరుదాటితే చాలు ఇంటినుంచి బయటకు రాలేని పరిస్థితి. ఇతర పనుల మీద పక్క గ్రామాలకు వెళ్లేవారు ఈ రోడ్లు వెంబడి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో జీడి తోటలు శుభ్రం చేసే పనులకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఎలుగుల నుంచి రక్షణ కల్పించాలని గ్రామానికి చెందిన వెంకటరావు, వైకంఠరావు, శ్రీనివాస్ తదితరులు కోరుతున్నారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పొందూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వీఆర్ గూడెం-లోలుగు మార్గంలో లోలుగు సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్నారన్న విషయం తెలిసి ఆదివారం దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1,02,360 నగదు, ఆరు సెల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పేకాట ఆడుతున్న శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఆరుగురిని, లోలుగుకి చెందిన ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నగరంలో చోరీ


పరిశీలిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని బలగ పరిధి కళింగ టవర్స్ రెండో ఫ్లోర్లో నివాసం ఉంటున్న ఓ మహిళ ఇంటిలో ఆదివారం చోరీ జరిగింది. నరసన్నపేటలోని ఓ కార్యక్రమానికి ఆమె వెళ్లగా.. ఈ ఘటన జరిగింది. ఆరు తులాల బంగారంతో పాటు రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే ఆ ప్రదేశాన్ని సందర్శించి, బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డుకి గండి



పాతపట్నం ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకి కాపు వీధి నుంచి వెళ్లే పడమటిగట్టు రోడ్‌కు గండిపడి రాకపోకలకు అంతరాయాలు ఏర్పడ్డాయి. దీంతో అటుగా వెళ్లాల్సిన వారంతా ఇబ్బందిపడుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణం జరగ్గా.. రెండు చోట్ల కల్వర్టులు వేయాల్సి ఉండగా.. ఒక్కచోట కల్వర్టు వేసి వదిలేశారు. దీంతో ఇప్పుడు కురిసే వర్షానికి పిల్లివీధి మొదలుకొని దిగువల వీధుల గుండా వచ్చే నీరు ఈ కల్వర్టు గుండా వెళ్లలే గండి పడింది.

లింకు పనిచేయక రైల్వే ప్రయాణికుల అవస్థలు


టిక్కెట్ కౌంటర్ వద్ద వేచిఉన్న ప్రయాణికులు

జలుమూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వేస్టేషన్‌లోని టిక్కెట్లు కౌంటరు వద్ద ఆదివారం లింకు పనిచేయక రైల్వే ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఉదయం తిరుపతి నుంచి పూరి వెళ్లే ఎక్స్‌ప్రెస్ కోసం పలువురు ప్రయాణికులు తిలారు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ట్రైన్ వచ్చే ముందు టిక్కెట్లు కోసం కౌంటరు వద్దకు ప్రయాణికులు వెళ్లగా లింకు పనిచేయడం లేదని సిబ్బంది చేతులెత్తేయడంతో ఇబ్బందిపడ్డారు. దీంతో చేసేది లేక కొంతమంది టిక్కెట్లు లేకుండానే రైలు ఎక్కేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


తేలినీలాపురం పక్షుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి, వ్యవసాయ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పంట ఉత్పాదకతను మెరుగుపరచేందుకు, మార్కెట్ సౌకర్యాలను విస్తరించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామని అన్నారు. జిల్లాలో 2,74,208 మంది రైతులకు రూ.186 కోట్లు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయడం జరిగిందన్నారు. పంటల పెట్టుబడి ఖర్చుల కోసం పథకం నగదు ఉపయోగపడిందని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆనందం వ్యక్తం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు త్రినాథస్వామి, జగన్మోహన్‌రావు, రైతులు, టీడీపీ నాయకులు కర్రి అప్పారావు, రోణంకి లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొన్నాళ్లగా క్యాన్సర్ వ్యాధిలో బాధపడుతున్నాని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకోవాలి మంత్రిని సంతబొమ్మాళి మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన చల్లా రాజారావు కోరారు.

పర్యాటక కేంద్రంగా.. తేలినీలాపురం

టెక్కలి రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విదేశీ పక్షులకు అవాసంగా ఉన్న తేలినీలాపురంను పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయనున్నట్టు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం రాత్రి ఆకస్మింగా తనిఖీ చేశారు. గత నెల 23న 'ఆంధ్రజ్యోతి'లో విదేశీ పక్షులకు విడిది ఎలా? అంటూ వచ్చిన కథనంపై స్పందించిన మంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏపీ టూరిజం ద్వారా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు సందర్శించేందుకు వీలుగా విడిది సౌకర్యం నిర్మాణం చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో మూలపేట పోర్టు నిర్మాణం జరుగుతున్నందున ఈ పారిశ్రామిక కేంద్రంగా మారబోతుందన్నారు. మూలపేట నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు రహదారి విస్తరణకు కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. ఈయతో పాటు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు ఎల్ఎల్ నాయుడు, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

- రెండుచోట్ల 7.2 కిలోలు స్వాధీనం
- నలుగురి అరెస్టు.. మరొకరు పరారీ


పాతపట్నం: వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

పలాస/ పాతపట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పలాస, పాతపట్నం మండలాల్లో పోలీసులు ఆదివారం చేపట్టిన తనిఖీల్లో 7.2 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మరొకరు పరారయ్యారు. ● పలాస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-2లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశా రాష్ట్రం అంబుగాన్ గ్రామానికి చెందిన రాహుల్‌బ్యూరో అనే వ్యక్తిని రైల్వే హెచ్‌సీ సోమేశ్వరరావు, పోలీసులు తనిఖీ చేశారు. ఆయన బ్యాగును చేయగా నాలుగు కిలోల గంజాయి బయటపడింది. తన సోదరుడు పిపిన్‌తో కలిసి రైలులో హైదరాబాద్ వెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకున్న రాహుల్ బ్యూరో పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులను చూసి పిపిన్ పరారీ అయ్యాడు. ఆయన కోసం గాలిస్తున్నట్లు రైల్వే ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ● ఒడిశాలోని జాజుల్‌పూర్ నుంచి పాత పట్నం మండలం కాగువాడ గ్రామానికి గంజాయిని తీసుకువచ్చిన రవీంద్ర ప్రధాన్ అనే వ్యక్తి పోలీసు లకు పట్టుబడ్డాడు. ఈ వివరాలను పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో సీఐ వి.రామారావు విలేకరులకు వెల్లడించారు. రవీంద్ర ప్రధాన్.. కాగువాడ గ్రామానికి చెందిన నవీన్ బరోడా, లావాటి నీలకంఠంకు విక్రయించేందుకు మూడు ప్యాకెట్లలో 3.2 కిలోల గంజాయి తెచ్చాడు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ బి.లావణ్య తన సిబ్బందితో మాటువేసి స్థానిక నీలమణిదుర్గ ఆలయ సమీపంలోని తోటలో ఉన్న రవీంద్ర, నవీన్, నీలకంఠంను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణం మన బాధ్యత


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

టెక్కలి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మూఢ విశ్వాసాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పాలకులు, ప్రజలు బాధ్యత వహించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు కోరా రు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక టెక్కలి నియోజకవర్గ స్థాయి ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ ఫ్యాక్టరీలను నిషేధించాలని కోరారు. చెకుముఖి సంబరాలను విజయవంతానికి కృషి చేయాలన్నారు. జిల్లా అకడమిక్ కన్వీనర్ పాలవలస ధర్మారావు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాల్ని నిషేధించాల్సిన పాలకులు వాటి ఏర్పాటుకు అమెరికా వంటి సంస్థలకు స్థలాలు మంజూరు చేయడం దురదృష్టకరమన్నారు. నియోజకవర్గ బాధ్యులు కురమాన దాలయ్య, బాలక శంకరరావు, తమ్మినేని వైకుంఠరావు, డొంకాన పాపారావు, బమ్మిడి అరుణకుమార్, జి.మోహనరావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు అలవర్చుకోవాలి


సామగ్రి అందిస్తున్న వెంకన్న చౌదరి తదితరులు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని పలాస నియోజకవర్గ సమన్వయకర్త టీడీపీ, రాష్ట్ర కార్యదర్శి వై.వెంకన్న చౌదరి (వీసీ) అన్నారు. అక్కుపల్లి ప్రభుత్వ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన పవనపుత్ర సేవా సంస్థ సమకూర్చిన ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, విద్యార్థులకు అవసరమై సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులు పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సదుపాయలు కల్పిస్తుందన్నారు. అలాగే గౌతు లచ్చన్న స్వచ్ఛంద సేవా సంస్థ తరుపున పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావు, టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, పవన పుత్ర సేవా సంస్థ వ్యవస్థాపకులు మజ్జి భాస్కరరావు, బాలరాజు, కొల్లి పాల్గొనరావు, హనుమంతు జనార్దన్, కంచరాన అనిల్, రాజమండ్రి అనిల్, తరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు తక్షణమే చేపట్టాలి

పాతపట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పాతపట్నం-సరాళి రోడ్డు పనులు తక్షణమే పూర్తిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సరాళి రోడ్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా మరమ్మతులకు నోచుకోని ఈ రోడ్డుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అయితే పనులు ప్రారంభించిన అనతికాలంలోనే అసంపూర్తిగా నిలిపివేయడంతో వాహనదారులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బీజేపీ నాయకులు పడాల షన్ముఖరావు, బడియాల బాబూరావు తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

నరసన్నపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కలివరపుపేటలో గల షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. హోమాలు, అభిషేకాలను జరిపించారు. అనంతరం నిర్వహించిన హారతి కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రాచీన చరిత్రకు ప్రతీకలు కుడ్య చిత్రాలు


కుడ్య చిత్రాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శ్రీవైష్ణవ క్షేత్రం శ్రీకూర్మనాథ ఆలయంలో గోడలపై ఉన్న ప్రాచీన ఆకు పసర చిత్రాలు (కుడ్య చిత్రాలు) ఆలయ చరిత్రకు, వారసత్వానికి ప్రతిరూపాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశ్రాంత బ్యాంకు అధికారి, ప్రముఖ చిత్రకారుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు పునఃసృష్టి చేసిన ఆకు పసర (కుడ్య చిత్రాలు) చిత్రాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించి కుడ్య చిత్రాల ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం చిత్రకారుడు సుబ్ర హ్మణ్యేశ్వరరావు దంపతులను అభినందించారు. తొలుత ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో కె.నరసింహనాయుడు, ప్రముఖ శిల్పాచార్యుడు దివిలి అప్పారావు, పలువురు చిత్రకారులు, స్థానిక పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలి యాత్రకు పూర్వ వైభవం తీసుకొద్దాం

జలుమూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాజులు కాలంలో నిర్వహించే బాలి యాత్రకు పూర్వ వైభవం తీసుకొద్దామని, దీనికి ప్రతీ ఒక్కరి సహాయ సహకారాలు కావాలని కార్యనిర్వహక ప్రతినిధి డాక్టరు జీవితేశ్వరరావు అన్నారు. కార్తీక పౌర్ణమి నుంచి ప్రారంభమయ్యే బాలియాత్ర ఏర్పాట్లపై ఆదివారం శ్రీముఖలింగంలో స్థానిక పెద్దలతో సమావేశం నిర్వహించి చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులు టి.సతీష్‌కుమార్, కె.హరిప్రసాద్, హెచ్‌వీ దొర, జలుమూరు ఏఎంసీ చైర్మన్ తర్ర బలరాం, న్యాయవాది చింతాడ వెంకటరావు, అర్చకులు శేషాద్రి వెంకటాచలం, నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆత్మహత్యలు వద్దు.. ఆత్మీయత ముద్దు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రంజిత్‌కుమార్

పోలాకి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న విషయాల్లో పట్టుదలకు పోయి ఆత్మహత్యలకు పాల్పడి నిండుప్రాణాలను తీసుకుంటున్నారని ఇది మంచి పద్ధతి కాదని అందరూ ఆత్మీయతా భావంతో ముందుకు సాగాలని ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన గాతలవలస, జడూరు, పిరువాడ, యాట్లబసివలస, కొండకొత్తపేట గ్రామాల్లో ఆయన పర్యటించి అవగాహన సదస్సులు నిర్వహించారు. మెండ శ్రీనివాసరావు, గొండు కేశవరావు, ఎంపీటీసీలు వై.లక్ష్మణరావు, గొండు మురళీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముంపులో వరి పంట



హిరమండలం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చిన్నకోరాడ వీధి సమీపంలోని పంట పొలాలు ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు వంశధార కుడి కాలువ యూటి నుంచి వచ్చిన నీరు పోటెత్తడంతో దాదాపు 25 ఎకరాలు నీట మునిగింది. కాలువ ఆక్రమణలకు గురికావడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు.

యూరియా.. ఏదయ్యా?

(ఐదో పేజీ తరువాయి)

అందించారు. అదే యూరియా బస్తాను ప్రైవేట్ వ్యాపారులు రూ.350 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు అధిక ధర వెచ్చించి యూరియాను కొనుగోలు చేస్తున్నారు.

గోడౌన్లలో స్టాక్..

జిల్లాలోని ప్రతీ ఎరువుల దుకాణానికి వారానికి ఒకసారి లారీలోడ్ యూరియా వస్తుంది. దీన్ని వ్యాపారులు తమ దుకాణాల్లో దించకుండా, అనుమతి లేని గోడౌన్‌లలో నిల్వ చేస్తున్నారు. కొన్ని బస్తాలను మాత్రమే దుకాణాల్లో ఉంచుతున్నారు. దీంతో యూరియా కావాలని దుకాణాలకు వెళ్తున్న రైతులకు స్టాక్ తక్కువగా ఉందని ఆ బస్తాలను చూపించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రెగ్యులర్‌గా తమ వద్ద ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు మాత్రం తక్కువ ధరకు ఇస్తున్నారు. ఆర్ఎస్‌కేలు, సహకార సంఘాలు యూరియా తెప్పించడం లేదని, పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

పూర్తికాని ఉబాలు..

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఇంకా ఉబాలు పూర్తికాలేదు. ఈ రెండు నియోజక వర్గాలకు వర్షాధారమే. పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార ఎడమ కాలువ ఉంది. కానీ, శివారు ఆయకట్టుగా ఉండడంతో ఎప్పుడు నీరు వస్తుందో? ఎప్పుడు రాదో? తెలియని పరిస్థితి. ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేటలో అరకొరగా ఉబాలు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతాలుగా ఉన్న లావేరు, రణస్థలంలో సైతం ఇంతవరకూ ఉబాలు జరగలేదు. శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లో మాత్రమే వరి నాట్లు వేయడం పూర్తయింది. టెక్కలిలో సగం వరకూ జరిగాయి. వరి నాట్లు పూర్తయిన చోట యూరియాతోపాటు డీఏపీ అవసరం అవుతోంది. కానీ, అవి దొరకడం లేదు. దీంతో యూరియా వినియోగానికి అదును దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొరత లేదు

జిల్లాలో ఎరువుల కొరత లేదు. డీఏపీ ముందుగానే తెప్పించాం. ఎక్కడకు యూరియా అవసరమో అక్కడికే పంపిస్తున్నాం. ఎరువుల విషయంలో అదనంగా వసూలు చేసే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. ప్రతీ రైతుకి అవసరానికి తగ్గట్టు ఎరువులను అందిస్తాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రస్తుతం డీఏపీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేనప్పటికీ భాస్వరం, నత్రజని కలిపి కాంప్లెక్స్ ఎరువులు అందిస్తున్నాం. పూర్తిస్థాయిలో వర్షాలు లేనందున ఎక్కువ శాతం వరినాట్లు కాలేదు. ప్రస్తుతం సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- పి.భవానీ శంకరరావు, వ్యవసాయ శాఖ ఏడీ, సోంపేట

నేడు, రేపు
విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండల పరిధిలో సోమవారం, మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఆ శాఖ ఈఈ నరసింహకుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ కాపువీధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మంగళవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కె.గోపాలపురం, దశరథపురం, తిడ్డిమి, సూర్యనారయణపురం, రంకిణి చంగుడి సరాళి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా చేపట్టనున్న పనులు కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

● కోటబొమ్మాళి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి, కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ నరసింహకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నసాన, పులిబంద, గుడివాడ, ఊడికలపాడు, జీయన్నపేట, వరహాలమ్మపేట తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వరరావు


సంఘ నూతన కార్యవర్గం

పలాస, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా టీడీపీ నాయకుడు డోకి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈయనతో పాటు కార్యదర్శిగా తంగుడు కామేశ్వరరావు, కోశాధికారిగా కోట్ని శశికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరి ఎంపికపై పలాస-కాశీబుగ్గ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు డోకి రామారావు హర్షం వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గానికి సంఘ గౌరవ అధ్యక్షుడు మల్లా భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, జిల్లా రైస్‌మిల్లర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, ఇంగిలిగాం పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, వీవీ సతీష్‌కుమార్, కొత్తకోట తిరుమలరావు శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక బాధ్యతగా పనిచేయాలి

నరసన్నపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వైద్యసంస్థలు సామాజిక బాధ్యతగా పేదలకు ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సేవలను అందజేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. ఆదివారం వీరన్నాయుడు కాలనీలో ఓ కార్పొరేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభి మాట్లాడారు. వైద్యశిబిరాల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందజేయడంతో పాటు ఆరోగ్యం మెరుగునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు అడపా చంద్రశేఖర్, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, నాయకులు కింజరాపు రామారావు, పీస కృష్ణ, బెవర రాము, బలగ ప్రహర్ష, పూతి రమణ, బైరి భాస్కరరావు, ఉణ్ణ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

వర్షం కోసం పూజలు

నందిగాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వర్షాలు పడాలంటూ కాపుతెంబూరు గ్రామస్థులు ఆదివారం వరద పాయసం పోశారు. గ్రామ సమీపంలో గల సీత కొండ వద్ద ప్రత్యేకంగా పూజలు చేపట్టి వరద పాయసం పోసి నైవేద్యాన్ని సమర్పించారు. కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో పంటలు ఎండిపోతుండడంతో వర్షాలు పడాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు గ్రామస్థులు తెలిపారు.

ఒడిశాకు నాలుగు.. ఆంధ్రాకు ఒకటి

(ఐదో పేజీ తరువాయి)

కల్పించారు. కానీ, ఆంధ్రాకు మాత్రం గుణుపూర్-విశాఖపట్నం పాసింజర్‌నే పరిమితం చేశారు. గుణుపూర్-విశాఖ పాసింజర్ విశాఖపట్నంలో ప్రతిరోజూ ఉదయం 6గంటలకు బయలుదేరి ఉదయం 11.30 గంటలకు గుణుపూర్‌కు చేరుతుంది. మళ్లీ మధ్యాహ్నం 3గంటలకు గుణుపూర్‌లో బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. రాత్రివేళ కావడంతో ఈ ప్రాంతవాసులు వైద్యసేవలు లేదా చదువుల కోసం విశాఖపట్నం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తెలుగు ప్రజలకు అక్కరకు రాని సమయంలో గుణుపూర్-విశాఖ పాసింజర్‌ను నడుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పాతపట్నం రైల్వే స్టేషన్‌లో రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. దీనివల్ల హిరమండలం, కొత్తూరు, సారవకోట, తెంబూరు తదితర ప్రాంతాల ప్రజలు ఒడిశాకు వెళ్లేందుకు రాజ్యరాణి సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు అంటున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎంపీ, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి గుణుపూర్-నౌపడ మార్గంలో రైల్వే సేవలు పెంచాలని కోరుతున్నారు.

ట్రావెల్స్ బస్సులే దిక్కు..

పాతపట్నం నుంచి హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, తిరుపతి, బెంగళూరు తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎలాంటి రైళ్లు ఆగవు. దీంతో స్థానిక ప్రజలు ట్రావెల్స్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 25 ట్రావెల్స్ బస్సులు పాతపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు దూర ప్రాంతాలకు వెళ్లివస్తుంటారు. అంతటి ఆదరణ, అవసరం ఉన్నా పాతపట్నం రైల్వేస్టేషన్ నుంచి రైలు సేవలు కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.